క్లుప్తంగా

'మన ఊరు - మన బడి' పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారులు

సుజాతనగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు – మన బడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నాగరాజు శేఖర్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పాటు, లక్ష్మీదేవిపల్లి తండాలోని ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు – మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సెక్టోరియల్ అధికారి సైదులు, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి



బిల్ కలెక్టర్లతో మాట్లాడుతున్న సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో ప్రజలు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ రఘులు తెలిపారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో బిల్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. ఆస్తి పన్నులు ప్రస్తుతం, గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలు వసూలు చేసేందుకు టీంలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తయారు చేసిన ప్రణాళిక ప్రకారం మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు.

అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ల బృందం

చుంచుపల్లి: తనికెళ్ల మండలం పల్లిపాడు వాస్తవ్యులు 57 సంవత్సరాల కృష్ణకుమారి అరిగిన కుడి మోకాలుతో అవస్థలు పడుతూ కొత్తగూడెం వరుణ్ ఆర్థోపెడిక్ ఆస్పత్రిని సంప్రదించారు. వైద్యులు జి.వరుణ్‌కుమార్ శనివారం మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆధునిక కార్పొరేట్ వైద్యాన్ని కొత్తగూడెం వాసులకు అందుబాటులోకి తెచ్చి నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందిస్తూ డాక్టర్ వరుణ్‌కుమార్ పలువురి ప్రశంసలు అందుకున్నారు. గతంలో కూడా ఎన్నో అరుదైన శస్త్ర చికిత్సలు వరుణ్ ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో విజయవంతంగా చేశబూరు. ఈ శస్త్ర చికిత్సలో మత్తు వైద్యులు డాక్టర్ బి.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

చుంచుపల్లి: జిల్లాలోని పేద పద్మశాలి విద్యార్థులకు గ్రూపు-1కు ఉచిత కోచింగ్, భోజన వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పద్మశాలి జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంజి రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి అనంతుల లక్ష్మీనారా యణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పేద పద్మశాలి విద్యార్థులు గ్రూప్ వన్ మెయిన్స్ ఎగ్జామ్‌కు క్వాలిఫై అయినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8555002354 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహిళలకు ఆర్థిక భరోసా ఉండాలి



మాట్లాడుతున్న శివరాం ప్రసాద్

ఇల్లెందు: నేటి సమాజంలో మహిళలకు ఆర్థిక భరోసా అవసరం అని ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శివరాం ప్రసాద్ అన్నారు. శనివారం ఇల్లెందులోని హరిప్రియ ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంఎస్‌ఎంఈ ద్వారా వివిధ రకాల యూనిట్లు నెలకొల్పి వాటి ద్వారా ఆర్థికంగా భరోసా ఇవ్వాలన్నారు. వారు ఎంచుకున్న రంగాల్లో శిక్షణ పొందాలని పేర్కొన్నారు. మార్కెట్ చైర్మన్ హరిసింగ్ మాట్లాడుతూ.. త్వరలో రూ.2 కోట్లతో గార్మెంట్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేసి మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కోచ్ గోవింద్, కౌన్సిలర్ సిలివేరు అనిత, జేకే శ్రీను, మనోహర్ తివారీ, పరుచూరి వెంకటేశ్వరరావు, పెండ్యాల హరికృష్ణ పాల్గొన్నారు.

మళ్లీ.. పాత రోజులొచ్చాయి

సినిమా థియేటర్లు హౌజ్‌ఫుల్
- ఓటీటీ ప్లాట్ ఫాం వచ్చినా తగ్గని క్రేజ్
- టాకీస్‌కు వెళ్లి చూస్తే ఆ కిక్కే వేరు అంటున్న సినీప్రేమికులు
- కరోనా తరువాత ప్రేక్షకుల ఆదరణ



కొత్తగూడెంలోని శ్రీవిశ్వరూప థియేటర్

SUNDAY SPECIAL

కొత్తగూడెంటౌన్: మనకు ఇష్టమైన హీరో, హీరోయిన్ల సినిమాలను తెర్పై చూస్తే ఆ కిక్కే వేరప్పా.. అంటూ ప్రేక్షకులు వినోదం కోసం సినిమా హాళ్లకు పరుగులు పెడుతున్నారు. కోవిడ్ తరవాత మళ్లీ ఇన్నాళ్లకు సినిమా థియేటర్లకు ఆదరణ పెరిగింది. సినిమాకు టైం అవుతోంది.. తయారయ్యారా.. ఎంతసేపు సినిమా స్టార్ట్ అవుతుంది.. అంటూ హడావుడి చేస్తూ బంధువులు, స్నేహితులను తొందర పెడుతూ సినిమాకు వెళ్లి సినిమా చూస్తే వచ్చే సంతోషం గురించి ఎంత చెప్పినా తక్కువే. తమ అభిమాన సినిమా హీరోను వెండితెర్పై చూసి ఆనందంగా గడపడం బాగుంటుందని ప్రేక్షకులు అంటున్నారు. స్మార్ట్ టీవీల్లో ఓటీటీ ప్లాట్ ఫాంపై వస్తున్న వెబ్ సీరీస్‌లతోపాటు కొత్త సినిమాలు మొబైల్స్, టీవీల్లో చూస్తున్నా.. సినిమా హాల్స్‌కు వెళ్లి చూస్తే ఆనందంగా ఉంటుంది. కరోనా నుంచి ప్రేక్షకులు ఇంటికి పరిమితం అయి అందరూ నెట్‌ఫ్లిక్స్, అమెజాన్, ఆహాలతో పాటు మరికొన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం, ఇంట్లో ఆండ్రాయిడ్ టీవీల్లో సినిమాలకు అలవాటు పడ్డారు. కానీ పూర్తిస్థాయిలో వినోదాన్ని ఆస్వాదించలేక పోతున్నామని ప్రేక్షకులు చెబుతున్నారు. కరోనా తరువాత 2022 నుంచి ప్రతి పండుగకు కొత్త సినిమాలు విడుదల అవుతూ ప్రేక్షకులకు వినోదాలను పంచిపెడుతున్నాయి. ఎన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు వచ్చినా సినిమా హాళ్లనే ఎక్కువ మంది ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. దీంతో ప్రతి సినిమా హాళ్లకు ప్రేక్షకులను మరింత ఆకర్షించేందుకు లేటెస్ట్ సౌండ్ సిస్టంతో థియేటర్లు మారిపోయాయి. ప్రేక్షకులు టికెట్ల కోసం క్యూలో నిలబడకుండా ఆన్‌లైన్‌లోనే టికెట్లను విక్రయించడంతో ప్రేక్షకులు నేరుగా వచ్చి థియేటర్లలోకి వెళ్లేందుకు యాజమాన్యాలు ఏర్పాట్లు చేసి ప్రేక్షకులను మరింత ఆకర్షిస్తున్నారు. ఇందులో భాగంగా పాత పాల్వంచలో కేవలం 100 సీట్ల సామర్థ్యంతో సినిమా హాల్ అందులోనే రెస్టారెంట్ వంటి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేశారు. దీంతో సినిమా ప్రేమికులు వీకెండ్‌లో ఏ సినిమా రిలీజ్ అవుతుందోనని ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 18 థియేటర్లు..

జిల్లాలో ప్రస్తుతం కొత్తగూడెంలో– 4 సినిమా హాళ్లు (పరమేశ్వరీ, మహేశ్వరీ, విశ్వరూప, పూర్ణ), పాల్వంచలో 2 (వెంకటేశ్వర, శాంతి), పాత పాల్వంచలో చోటి మహారాజ్ సినిమా (100 సీట్లు)- 3, భద్రాచలం (ఉదయబాస్కర్, విజయబాస్కర్)-2, దమ్మపేట-1, ఇల్లెందు -3, మణుగూరు-2, చర్ల -1 సినిమా హాళ్లలో ప్రదర్శలను జరుగుతున్నాయి. బాల్కనీతో పాటు పలు తరగతులకు సంబంధించి ఒక్కో టికెట్ ధర రూ.110, రూ.80, రూ.50 టికెట్లతో ప్రేక్షకులు వినోదం పొందుతున్నారు.

కరోనా సమయంలో సినిమాలకు దూరం..

2020 మార్చి నెల నుంచి 7 నెలల పాటు (210 రోజులకు పైగా) కరోనా వైరస్ ప్రభావంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ విధించడంతో అన్ని సినిమా హాళ్లు మూతపడ్డాయి.

ఆ తరువాత కరోనా నిబంధనలు ఎత్తివేసినా సినిమా హాళ్లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. 2021 అక్టోబర్‌లో 50 శాతం సీట్ల ఆక్యుపెన్సీతో అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం కరోనా తగ్గుముఖం పట్టడంతో పూర్తిస్థాయిలో అనుమతిచ్చింది ప్రభుత్వం.

థియేటర్లకు ఆదరణ ఉంటుంది



ఎన్ని ఆన్‌లైన్ ఓటీటీ ప్లాట్‌ఫాంలు వచ్చినా సినిమా హాళ్లకే ఆదరణ ఉంటుంది. బంధువులు, స్నేహితులతో కలిసి సినిమా చూడటానికి ఎక్కువ మంది ఇష్టపడుతుంటారు. కరోనా తరువాత ఇప్పుడు సినిమా హాళ్లలో రద్దీ పెరిగింది. సినిమాలను వెండి తెర్పై చూస్తేనే వినోదంతో పాటు సంతోషం.

– జి.శ్రీనివాస్, మేనేజర్, పరమేశ్వరీ సినిమా హాల్

సినిమాలు ఆడితేనే మాకు ఉపాధి



కరోనా సమయంలో మేము ఇబ్బంది పడ్డాం. తిరిగి సినిమా హాళ్లు ప్రారంభమైన తరువాత మాకు ఉపాధి దొరకడం సంతోషంగా ఉంది. పెద్ద హీరోలతో పాటు చిన్న సినిమాలు కూడా వస్తుండటంతో సినిమా హాళ్ల వద్ద సందడి వాతావరణం ఉంది. మా ఇబ్బందులు తొలగిపోయాయి.

– మధుపవర్, థియేటర్ వర్కర్, కొత్తగూడెం

థియేటర్‌లో చూస్తేనే ఆనందం



స్మార్ట్ టీవీ, ఓటీటీ ప్లాట్ ఫాంలో వస్తున్న వెబ్ సీరీస్‌లతోపాటు కొత్త సినిమాలు మొబైల్స్, టీవీల్లో చూస్తున్నా.. సినిమా హాల్‌కు వెళ్లి చూస్తే ఆనందంగా ఉంటుంది. థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య కూర్చొని అభిమాన హీరో సినిమా చూస్తుంటే ఆ ఆనందం చెప్పలేం.

– నాగరాజు, ప్రేక్షకుడు, త్రీఇంక్లైన్, కొత్తగూడెం

ప్రజాపోరాటాలతో ప్రతిఘటిస్తాం



మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వాలు భవన నిర్మాణ సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేయాలని చూస్తే ప్రజాపోరాటాలతో ప్రతిఘటిస్తామని తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్, గణేష్ టెంపుల్ అడ్డాలలో కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు పోటీ పడి సెస్ చార్జీలను తగ్గించి కార్మికుల సమస్యలను బోర్డుకు చెప్పుకునే వీలు లేకుండా, బోర్డు పాలక మండలి లేకుండా, నెలవారీ సమీక్షలు లేకుండా, నిధులు పక్కదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు.

కార్యక్రమంలో గుత్తుల సత్యనారాయణ, గిద్దాడి నగేష్, వేల్పుల మల్లికార్జున్, పోగుల కోటేశ్వరరావు, అనుమల రాజు, అనిశెట్టి భిక్షపతి, గుంటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీసీడబ్ల్యూయూ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: ఇఫ్టూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూయూ) రాష్ట్ర 7వ మహాసభ ఈనెల 29న కొత్తగూడెంలోని షాదీఖానాలో జరుగుతుందని కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టేకులపల్లి ఏరియా కార్యదర్శి కోటిలింగం పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధనకు ఐఎఫ్‌టీయూ అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. పాలకులు కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ మహాసభకు ఇఫ్టూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి గోకుల ప్రదీప్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్, టి.శ్రీనివాస్, ఎస్‌సీసీడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మానందం, ఎ.వెంకన్న పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

రహదారిపై ప్రమాద నివారణకు చర్యలు



జాతీయ రహదారిపై ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

పాల్వంచరూరల్: బీసీఎం జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు పోలీసుశాఖ ప్రత్యేక దృష్టిన సారించింది. ఈ మేరకు శనివారం మండలంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ.నాగరాజు, ఎస్ఐ శ్రీనివాస్ బీసీఎం జాతీయ రహదారిని పరిశీలించారు. రహదారిపై ప్రమాదాలు జరిగే మూడు బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఎక్కువ ప్రమాదకర ప్రదేశం కేశవాపురం ములమలుపు మొదటిగా, రెండోది జగన్నాథపురం గ్రామం వద్ద, మూడోది నాగారం కాలనీ గ్రామ పరిధిలో గుర్తించారు. ఈ మూడు ప్రాంతాల్లో నేషనల్ హైవే అథారిటీ అధికారుల సహకారంతో ఆయా ప్రదేశాల్లో బారికేడ్లు, ఇసుక డ్రమ్ములు, రిబ్బన్ ట్రిప్స్, హెచ్చరిక సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించడానికి తీసుకునే చర్యలకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

మందులు ఇంటికి పంపించండి



మాట్లాడుతున్న డైరెక్టర్(పా) చంద్రశేఖర్

సింగరేణి(కొత్తగూడెం): మాజీ ఉద్యోగులకు మందులను కొరియర్ ద్వారా వారి ఇంటికే పంపించాలని, అదేవిధంగా ప్రతి ఉద్యోగి ఆరోగ్య చిట్టా తయారు చేసి హాస్పటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో భద్రపరచాలని సింగరేణి డైరెక్టర్(పా) ఎస్.చంద్రశేఖర్ వివిధ విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీం (సీపీఆర్‌ఎంఎస్) 6వ సర్వసభ్య సమావేశం శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ ట్రస్ట్ చైర్మన్ హోదాలో డైరెక్టర్(పా), ట్రస్ట్ సభ్యులుగా డైరెక్టర్ ఫైనాన్స్ ఎన్.బలరామ్ హాజరై 2021–22కి సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆడిట్ రిపోర్ట్‌ను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఉద్యోగుల పెన్షన్, సీపీఆర్ ఎంఎస్ స్కీం మొదలైన పలు అంశాలపై చర్చించారు. డైరెక్టర్(పా) మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య వివరాలు వారికి ప్రతి నెల ఇచ్చే మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కొన్ని ఆస్పత్రుల్లో మాజీ ఉద్యోగులు చికిత్స కోసం వెళ్లితే సరైన స్పందన ఉండటం లేదని, పలు రకాల ఇబ్బందులు పెడుతున్నారని ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు అందజేశారు.

30న 'చలో ఢిల్లీ'



టీజేఎస్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

టేకులపల్లి: ఈనెల 30, 31 తేదీల్లో ఢిల్లీలో తెలంగాణ జన సమితి అధినేత, ప్రొఫెసర్ కోదండరాం సారథ్యంలో నిర్వహించే దీక్షకు వేలాది తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి సెంటర్‌లో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. మల్లెల రామనాథం, గుగులోత్ భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థలం కేటాయింపు



గ్రంథాలయం నిర్మించనున్న స్థలం

పాల్వంచరూరల్: స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయం పక్కనున్న ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్‌లో రెండు కుంటల స్థలాన్ని మున్సిపాలిటీ లైబ్రరీ నిర్మాణం కోసం కేటాయించినట్లు తహసీల్దార్ రంగాప్రసాద్ శనివారం తెలిపారు. స్థలాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీకి అప్పగించారు. స్థలంలో గ్రంథాలయ భవనాన్ని నిర్మించేందుకు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పరిశీలించి శుభ్రం చేయించారు. త్వరలో నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలివ్వండి



మాట్లాడుతున్న నర్సింగరావు

ఇల్లెందురూరల్: గిరిజన హాస్టల్, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న రోజువారీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ శనివారం కార్మికులు సమ్మె కొనసాగించారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిన ప్రభుత్వం చేసిన పనులకు కూడా వేతనాలు మంజూరు చేయకుండా కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, నర్సింగరావు, నాగరాజు, పద్మ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: పట్టణంలోని గణేష్ బార్ అండ్ రెస్టారెంట్ నుంచి మహబూబాబాద్ క్రాస్‌రోడ్ వరకు రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే హరిప్రియ భూమి పూజ చేశారు. శనివారం పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో పనులను ప్రారంభించారు. మాట్లాడుతూ.. అనిశెట్టిపల్లి నుంచి మహబూబాబాద్ వరకు రూ.40 కోట్లతో నేషనల్ హైవే రోడ్డు మరమ్మత్తు, విస్తరణ పనులకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, కమిషనర్ అంకుషావలీ, డీఈ రామకృష్ణ, ఏఈ శంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

గనిలో మ్యాన్ రైడింగ్ ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న వీరభద్రయ్య

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5షాఫ్ట్ గనిలో మ్యాన్ రైడింగ్ వీలైనంత త్వరలో అందుబాటులోకి తేవాలని టీబీజీకేఎస్ రీజియన్ కార్యదర్శి కూనన వీరభద్రయ్య గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్‌ను కోరారు. శనివారం మేనేజర్ కార్యాలయంలో మైన్స్ కమిటీ మీటింగ్ సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. గనిలో మ్యాన్ రైడింగ్ లేని కారణంగా కార్మికులు గంటల కొద్దీ నడిచి పనిస్థలానికి చేరుకొని విధులు నిర్వహించి మళ్లీ కిలోమీటర్ల దూరం నడవాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారని వెంటనే మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గనిలో వెంటిలేషన్, వెలుతురు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మేనేజర్ మీ సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కార మార్గం చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో సేఫ్టీ మేనేజర్ షాకీర్, వెల్ఫేర్ ఆఫీసర్ విజయ్, పిట్ సెక్రటరీ చిలక రాజయ్య, సక్రు, మోహన్, సవీర్, కృష్ణయ్య, శ్రీనివాస్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టం సవరిస్తే సహించం



మాట్లాడుతున్న వజ్జా సురేష్

ఇల్లెందు: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల మనుగడకు అత్యంత ప్రాధాన్యం కలిగిన 1/70 చట్టం రద్దు చేయాలని కోర్టును ఆశ్రయించారని, చట్టం లేకుండా చేయాలని కుట్రలు జరుగుతున్నాయని, 1/70 చట్టం జోలికి వస్తే సహించమని సీపీఎం అనుబంధ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జా సురేష్ హెచ్చరించారు. శనివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు జమ్మూ కశ్మీర్‌లో 375 ఆర్టికల్ వలె తెలంగాణ, ఏపీలో గిరిజనులకు రక్షణగా 1/70 చట్టం ఉందని, ప్రభుత్వం రద్దు చేయలేక కోర్టుల ద్వారా చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన లభించిన ఈ చట్టాన్ని రద్దు చేస్తే ఆదివాసీలు నిర్వాసితులు అవుతారని తెలిపారు. జీఓ నంబర్ 3పై కోర్టు ఇచ్చిన తీర్పు వల్ల ఏజెన్సీలో గిరిజనులు ఉపాధి కోల్పోయారన్నారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదివాసీ చట్టాలు రక్షణ కోసం కృషి చేయాలని కోరారు. ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు నోరు విప్పి కొట్లాడాలని కోరారు. కార్యక్రమంలో బోసు, వెంకటేశ్వర్లు, మల్లయ్య, రాజేష్, రామ్మూర్తి, రమేష్, భద్రం తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేజ్‌బోర్డ్‌లో తీరని అన్యాయం



మాట్లాడుతున్న రాజిరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): ఏడాదిన్నరగా అది చేస్తాం.. ఇది చేస్తాం.. అని జాతీయ కార్మిక సంఘాలు కార్మికులకు తీరని అన్యాయం చేశాయని, 11వ వేజ్ బోర్డ్ సమావేశంలో 19శాతం ఎంజీబీకే చతికిల పడ్డాయని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ మిరియాల రాజిరెడ్డి ఆరోపించారు. శనివారం కొత్తగూడెం ఏరియా పీవీకే – 5 షాఫ్ట్ గని ఆవరణలో ఏర్పాటు చేసిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ కార్మిక సంఘాల పసలేని ఆరోపణలు, డప్పాలు కొట్టుకోవటం ఎక్కువైందన్నారు. వారు ఆత్మవిమర్శ చేసుకోవాలని, వారు పోగొట్టిన ఎన్నో హక్కులను కోలిండియాలో సంబంధం లేకుండా గుర్తింపు సంఘంగా తాము ఎన్నో పథకాలు, హక్కులు కార్మికులకు సాధించిపెట్టిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, 11 మెన్ కమిటీ సభ్యులు కాపు కృష్ణ, మురాద్, విప్లవరెడ్డి, లింగాల జోసెఫ్, గోపు కుమార్, సకినాల సమ్మయ్య, బాలేరు, కనకరావు, సాంబయ్య, రవీందర్, భీముడు, నిమ్మల రాజేశ్వరరావు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి



సెమినార్‌కు హాజరైన విద్యార్థులు

కొత్తగూడెంటౌన్: లైంగిక వ్యాధుల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంఅండ్ హెచ్‌ఓ) అధికారిణి డాక్టర్ శిరీష అన్నారు. శనివారం పాత కొత్తగూడెంలోని జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలోని సెమినార్ హాల్‌లో నెహ్రూ యువ కేంద్ర ఖమ్మం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో లైంగిక వ్యాధులపై శిక్షకులకు శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శిరీష, జిల్లా సంక్షేమశాఖ అధికారిణి (ఐసీడీఎస్ పీడీ) స్వర్ణలత లెనినా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ సత్యకుమార్, జిల్లా టీబీ కంట్రోల్ కోఆర్డినేటర్ సోమయ్య, యువజన అవార్డు గ్రహీత ఆకులపల్లి మధు, వివిధ అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారుల మీద భారం వేయొద్దు


ఇల్లెందు: ప్రతినెల ఇంధన సర్దుబాటు చార్జీలను పెంచుకోవచ్చని రెగ్యులేటరీ కమిషన్ అనుమతులు అవసరం లేదని తెలుపుతూ డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డిస్కం)లకు విద్యుత్ నియంత్రణ మండలి స్వేచ్ఛ కల్పించటం పట్ల సీపీఎం ఇల్లెందు మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. శనివారం ఆ పార్టీ మండల కార్యదర్శి ఎస్ఏ నబీ మాట్లాడుతూ.. వినియోగదారుల మీద భారం మోపే ఆదేశాలు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. 2018 నుంచి 2022 వరకు రెగ్యులేటరీ కమిషన్ రాష్ట్రంలో టారిఫ్ నిర్ణయించలేదన్నారు. డిస్కంలు ఎలాంటి ప్రతిపాదనలు ఇవ్వలేదన్నారు. రూ.33 వేల కోట్ల వసూళ్లకు 2022–23లో టారిఫ్ ప్రతిపాదనలో ఎలాంటి సూచనలు లేవని చెప్పారు. రెగ్యులేటరీ కమిషన్ అనుమతులు లేకుండానే గత ఏడాది డెవలప్‌మెంట్ చార్జీలను వసూలు చేసిందన్నారు. డిస్కంలు అంతర్గత సామర్థ్యం పెంచుకోకుండా వినియోగదారుల మీద భారం వేయడం తగదన్నారు.



అటెన్షన్ ప్లీజ్

మురుగుతో పెద్దమ్మతల్లి భక్తుల పాట్లు

పాల్వంచ మండలం కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనక దుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. సెలవు రోజులు, ఆదివారం, పండుగ రోజుల్లో భక్తుల తాకిడి మరింతగా ఉంటుంది. అమ్మవారికి నైవేద్యం, వంటవార్పులు చెట్ల కిందనే చేసుకుని అక్కడే భోజనాలు చేస్తుంటారు. ఇక్కడ బోరు వద్ద మురుగు బయటకు వెళ్లే విధంగా డ్రెయినేజీ లేకపోవడంతో చుట్టుపక్కల అంతా నిల్వ ఉంటుంది. దీంతో ఈగలు, దోమలు అంతేకాకుండా భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈఓ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



– పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : రజనీ కుమారి, ఈఓ, పెద్దమ్మగుడి
సెల్ నంబర్ : 9490145010